కథ




# బడే సాయిబు

విన్నకోట రామచంద్ర కౌండిన్య

ఇది నలభై సంవత్సరాల కిందటి మాట.

ఆ రోజుల్లో కూడా ఆంధ్రదేశంలోని అత్యుత్తమసుందరప్రదేశంగా కోనసీమకు పోటీ లేదు. పుష్కలమైన ప్రకృతి. పచ్చటి పొలాలు. కొబ్బరి చెట్లు. గోదావరి నది కృప చేత సస్యశ్యామలమైన ప్రాంతం.

అప్పటికి ఇంకా గోదావరి నది పైన ఆలమూరు వంతెన, రావులపాలెం వంతెన పడలేదు. బయటి ప్రపంచపు ఆకారవికా రాల ప్రభావం ఇంకా ఆ ప్రాంతంపై ఎక్కువగా పడలేదు. గోదావరి పాయల మధ్య, అద్భుతమైన ప్రకృతి కౌగిలిలో బంధింపబడిన అక్కడి ప్రజలు మానవత్వవిలువలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న రోజులు అవి.

ఆ ప్రాంత ముఖ్యపట్టణమైన అమలాపురంలో జరిగిన కథ ఇది.

000

ఆ రోజు దసరా పండుగ రోజు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. అక్టోబరు నెల అయినా ఎండ తీక్షణంగా ఉంది.

అది ఒక చిన్న ఇల్లు. పైన ఆస్బెస్టాస్ రేకులతో నిర్మించిన ఆ ఇల్లు, అందులో ఉండేవాళ్ల పేదరికాన్ని సూచిస్తోంది.

ఇంటి లోపల బడే సాయిబు మొహం మీద పసుపు రంగు పూసుకుంటున్నాడు. బ్రష్ తన బుగ్గల మీద చర్మానికి తాకుతోంటే బండగా, మొరటుగా గీసుకుంటున్నట్లుగా అనిపిస్తోంది బడే సాయిబుకి.

చెమటలు పోస్తున్నాయి. పక్కనే ఉన్న టేబుల్ ఫాన్ స్పీడు పెంచాడు. అప్పటివరకూ చేస్తున్న శబ్దాన్ని ఇంకా ఎక్కువ చేసు కుంటూ స్పీడు అందుకుంది ఫాన్. కొంచెం చల్లగా అనిపించింది.

సగం పగిలిన అద్దం ఎదురుగా ఒక స్టూలు మీద కూర్చుని, రంగు వేసుకుంటూ ఆలోచిస్తున్నాడు బడే సాయిబు. పది సంవత్సరాల నుంచీ ప్రతి సంవత్సరం దసరా పండుగ రోజున పులి వేషం వేస్తున్నాడు తను. అంతకు ముందు ముప్ఫయ్ సంవత్సరాల పాటు తన తండ్రి గులాం అలీ వేశాడు పులి వేషం. మొత్తం నలభై అయిదు సంవత్సరాల నుంచీ అమలాపురంలో దసరా పండుగ రోజున పులి వేషం ఈ ముస్లిం కుటుంబం వేస్తూనే వచ్చింది. ఇది ఒక ఆనవాయితీయే కాదు, ఈ ఊరి సంస్కృతిలో ఒక భాగం కూడా.

'బేటే!' అంటూ తల్లి పిలవటంతో ఈ లోకంలోకి వచ్చాడు బడే సాయిబు.

'బేటే, మీ అబ్బా జాన్ అల్లా దగ్గరికి వెళ్లిపోయి పదేళ్లయింది. అప్పటి నుంచి నువ్వు పులి వేషం వెయ్యటం మొదలు పెట్టిన తర్వాత దసరా, నవరాత్రులతో పాటు రంజాన్ నెల కూడా రావటం ఇదే మొదటిసారి. ఉపవాసం చేస్తూ ఈ వేషం వెయ్యగలవా?' ఆదుర్దా నిండిన కంఠంతో అడిగింది నసీమా.

తల్లి చెయ్యి పట్టుకుని, తన పక్కన ఉన్న ఇంకో స్టూలు మీద కూర్చో పెట్టాడు బడే సాయిబు. 'అమ్మీజాన్ నువ్వు ఊరికే పరేషాన్ అవుతున్నావు. ఇది నాకు మొదటి దఫా కావచ్చు. కాని అబ్బాజాన్ ఈ వేషం వేసిన ముప్పయి సంవత్సరాలలో దసరాతో పాటు రంజాన్ నెల కూడా రావటం ఎన్ని సార్లు జరిగింది?' అనునయంగా అడిగాడు.

'నాకు గుర్తుండి నాలుగుసార్లు వచ్చిందనుకుంటాను.'

'మరి ఆ రోజుల్లో అబ్బాజాన్ పులి వేషం వెయ్యలేదా?'

'వేశారు...'

'ఎందుకు వేశారంటావు? అది ఒక కట్టుబాటు. ఒక రివాజు. ఆరు నూరైనా ఈ రోజు పులి వేషం వెయ్యవలసిందే. ఇది మన రక్తంలో ఉంది. ఇది నా మనసులో నుంచి వచ్చిన కోరిక కాబట్టి, నాకు అలుపు రాదు. నువ్వేమీ భయపడకు. అబ్బాజాన్‌ని తలుచుకుంటూ ఈ రోజు పులి వేషం వేస్తాను' అని నచ్చచెప్పాడు.

నసీమా ఆప్యాయంగా కొడుకు తల నిమిరింది.

బడే సాయిబు మొహం మీద నల్ల చారలు వేసుకోవటం ప్రారంభించాడు.

000

బడే సాయిబు అమలాపురంలో ఆర్డీవో దగ్గిర జీపు డ్రైవరుగా పని చేస్తున్నాడు. వయసు నలభై సంవత్సరాలు ఉంటుంది. ఎప్పుడూ తెల్ల రంగు కాటన్ పైజమా, అదే రంగు కాటన్ జుబ్బా వేసుకుని ఉంటాడు. అతని బట్టల తెలుపు రంగు అతని నిర్మలమైన మనసుని తెలుపుతుంది. ఆకుపచ్చ రంగు తలపాగా అతని మతపరమైన నమ్మకాలని సూచిస్తుంది. కాళ్లకి ఉండే స్లిప్పర్లు మాత్రం అతని పేదరికానికి ప్రతీకలు.

పోయిన నెల కొత్త ఆర్డీవోగారు వచ్చి ఛార్జి తీసుకున్నారు. కాంప్ క్లర్క్ సత్యనారాయణగారు అందర్నీ పరిచయం చేస్తూ, చివరికి బడే సాయిబుని కూడా పరిచయం చేశారు.

'బడే సాయిబు... పేరు బావుంది. ఎంత కాలం నుంచీ చేస్తున్నావు

ఇక్కడ? ' అడిగారు ఆర్డీవోగారు, బడే సాయిబుని.

'సార్. దాదాపు పది సంవత్సరాల నుంచీ చేస్తున్నాను సాబ్!' అన్నాడు బడే సాయిబు.

'సార్. అమలాపురం ఒక డివిజన్ అయిన దగ్గర్నుంచీ ఆర్డీవోకి డ్రైవరుగా బడే సాయిబు ఉన్నాడు సార్. చాలా నమ్మకమైన మనిషి' అన్నారు సత్యనారాయణగారు.

బడే సాయిబు ఒక అసాధారణమైన మనిషి. అతని కళ్లల్లో ఒక రకమైన నిజాయితీ కనిపిస్తుంది. తన డ్రైవరు ఉద్యోగాన్ని చాలా గర్వంగా చేస్తాడు. తను ఆర్డీవోగారి డ్రైవరు అయినందుకు ఒక రకమైన హుందాగా ప్రవర్తిస్తాడు.

'ఇతని డ్రైవింగ్ కూడా చాలా బావుంటుంది సార్. బడే సాయిబు డ్రైవింగ్‌లో ఇప్పటి వరకూ ఆక్సిడెంట్ జరగలేదు సార్!' అన్నారు సత్యనారాయణగారు, పరిచయకార్యక్రమం పూర్తి చేస్తూ.

000

టైం రెండైంది.

బడే సాయిబు పులివేషం వేసుకోవటం పూర్తయింది. లేచి నిల బడ్డాడు. వేషం చాలా బాగా కుదిరింది. బాగా దగ్గిర నుంచి చూస్తే గాని ఆవేషం వేసుకున్నది బడే సాయిబు అని గుర్తుపట్టటం కష్టం. ఒళ్లంతా పసుపుపచ్చ రంగు, దాని మీద నల్లటి పులిచారలు, పసుపు రంగు లంగోటీ బిగించి కట్టుకున్నాడు. వెనకాల చిన్న తోక.

ప్రతి సంవత్సరం అతని వెంట వెళ్లేవాళ్లు కొందరు వచ్చి చేరారు. డప్పులు వాయించేటందుకు ఎప్పటిలాగే కోటయ్య వచ్చాడు. ఈ సారి తనతో పాటు హనుమంత్‌ని కూడా తీసుకు వచ్చాడు.

'ఇద్దరం కలిసి డప్పులు వాయిస్తోంటే ఇంకా జోరుగా ఉంటుంది బడేసాయిబూ!' అన్నాడు కోటయ్య. బడే సాయిబు వాళ్లిద్దరినీ ఆహ్వానించాడు.బడే సాయిబు కజిన్ అహ్మద్ కూడా వచ్చాడు. ఆ వాడలో పిల్లలు ఓ పదిమంది వచ్చి చేరారు. అందరూ కలిసి బయలుదేరారు. ఆ వాడలోవాళ్లంతా ఇళ్ల బయటికి వచ్చి చప్పట్లు కొట్టారు.

డప్పులు నెమ్మదిగా మోగుతున్నాయి. బడే సాయిబు పార్టీ కాలువ రోడ్డు మీద నుంచి వచ్చి ప్రభుత్వ ఆసుపత్రి దాటుకుంటూ చివరికి ఊరి సెంటర్లో ఉన్న గడియారపు స్తంభం దగ్గరికి చేరారు.

ఆ సెంటర్లో బడే సాయిబు ప్రతి సంవత్సరం ఈ రోజు పులి డాన్స్ చేస్తాడు. ఆ సెంటర్లో ఉన్న షాపుల యజమానులు అందరూ చేరి, ఆ డాన్స్ చూసి ఆనందిస్తారు. ఈ రోజు కూడా అందరూ గుమి కూడారు. భారీ ఎత్తున జనం చేరారు.

బడే సాయిబు పులి డాన్స్ చెయ్యటం మొదలుపెట్టాడు. అతని నడుముకి రెండు తాళ్లు కట్టి, వెనకాల ఇద్దరు లాగి పట్టుకున్నారు, పులిని అదుపులో ఉంచటానికి పట్టుకున్నట్లు. డప్పులకి అనుగుణంగా బడే సాయిబు స్టెప్పులు వేస్తున్నాడు. డప్పులు క్రమంగా జోరు అందు కున్నాయి. దానితో పాటు జనం అందరూ చప్పట్లు కొడుతూ, ఈలలు లయబద్ధంగా వేస్తున్నారు.

బడే సాయిబు పూనకం వచ్చినవాడిలాగా డాన్స్ చేశాడు. ఆ తన్మయత్వంలో అలా ఎంత సేపు చేశాడో తెలియదు.

డాన్స్ పూర్తి అయింది. జనం అందరూ పిచ్చిగా చప్పట్లు కొట్టారు. షాపు యజమానులు అందరూ కలిసి బడే సాయిబుకి దండ వేశారు. అందరి అభినందనలూ అందుకున్నాడు బడే సాయిబు.

అప్పటికి టైం నాలుగైంది. ఉదయం నుంచీ ఉపవాసం ఉండటం వల్ల బడే సాయిబు అలసిపోయి ఉన్నాడు. దేహం నీరసపడి పోతోంది. కాని మనసు మాత్రం ఇంకా డాన్స్ చెయ్యటానికి ఉవ్విళ్లూరుతోంది.

మనసులో అబ్బాజాన్‌ని తలుచుకున్నాడు. తండ్రి పులి వేషంలో డాన్స్ చెయ్యటం గుర్తు చేసుకున్నాడు. ఆ జ్ఞాపకాలతో ఉత్సాహం ద్విగుణీకృతం అయింది.

బడేసాయిబు పార్టీ గడియారం స్తంభం సెంటరు నుంచి కూచిమంచి అగ్రహారం వైపు నడవటం ప్రారంభించింది.

000

అమలాపురంలో కూచిపూడివారి అగ్రహారం ఒక ముఖ్యమైన రోడ్డు. ఆ ఊళ్లో ప్రఖ్యాత లాయర్లు ఆ రోడ్డు మీదే ఉండేవారు. జయంతి వారు, గిడుగువారు, అందులో ప్రముఖులు, పాలగుమ్మి సూర్యారావు గారు అప్పటికే పేరుగాంచినవారు. ఆర్డీవో ఆఫీసు ఆ రోడ్డు మీదే ఉంది.

ఆ రోజు ఆ వీధి అంతా హడావిడిగా ఉంది. దసరా నవరాత్రులకి పందిళ్లు వేశారు. మైకుల్లో సినిమా పాటలు వేసి హోరెత్తించేస్తున్నారు.

**'బేటే, మీ అబ్బా జాన్ అల్లా దగ్గరికి వెళ్లిపోయి పదేళ్లయింది. అప్పటి నుంచి నువ్వు పులి వేషం వెయ్యటం మొదలు పెట్టిన తర్వాత దసరా, నవరాత్రులతో పాటు రంజాన్ నెల కూడా రావటం ఇదే మొదటిసారి. ఉపవాసం చేస్తూ ఈ వేషం వెయ్యగలవా?' ఆదుర్దా నిండిన కంఠంతో అడిగింది నసీమా.**

అవన్నీ దాటుకుంటూ ఆర్డీవో ఆఫీసు చేరింది బడే సాయిబు పార్టీ. అది రోజు బడే సాయిబు పని చేసే ఆఫీసు. దసరానాడు ఆఫీసు ఎదురుగా పులి డాన్స్ చెయ్యటం బడే సాయిబుకి అలవాటు. అది అందరికీ తెలుసు. ఆఫీసులో పని చేసేవాళ్లు కొందరు వచ్చి వేచి ఉన్నారు.

ఎలిమెంటరీ స్కూలు పిల్లలని తీసుకుని, మాస్టారు సోమేశ్వరరావుగారు కొందరు ముఖ్యమైనవాళ్ల ఇళ్లకి వెళుతున్నారు. కొత్త బట్టలు వేసుకుని, పిల్లలు విల్లంబులు పట్టుకుని, బుక్కాలు చల్లుకుంటున్నారు. 'అయ్యవారికి చాలు అయిదువరహాలు. పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు' అని పాడుతూ ఒక లైనులో వెళుతున్నారు. బడే సాయిబుని చూసి అందరూ ఆగారు. సోమేశ్వరరావు మాస్టారి లైనులో నుంచి కొందరు పిల్లలు చప్పట్లు కొడుతూ వచ్చి, బడే సాయిబు చుట్టూ మూగారు. మిగతా పిల్లలు మాస్టారు తిడతారేమోనని లైన్లోనే నిలబడి చూస్తున్నారు. వాళ్లందరి ఉత్సాహాన్ని చూసి మాస్టారు కూడా ఆగారు. పరిస్థితి గ్రహించి 'మీరు కూడా వెళ్లండిరా!' అంటూ మిగతా పిల్లల్ని కూడా పంపించారు. పక్కనే ఉన్న అరుగు మీద కూర్చుని ఆయన కూడా బడే సాయిబు డాన్సు చూడటానికి ఉపక్ర మించారు. నెమ్మదిగా బడే సాయిబు డాన్స్ చెయ్యటం ప్రారం భించాడు. కొద్ది సేపటిలో డాన్స్ తారస్థాయికి చేరుకుంది. పిల్లలు, పెద్దలు, అందరూ లయబద్ధంగా చప్పట్లు కొడుతున్నారు. మధ్యలో పిల్లల్ని భయపెట్టటానికా అన్నట్లుగా వాళ్ల మీదికి ఉరుకుతున్నాడు, బడే సాయిబు. పిల్లలు కేకలు వేస్తూ చెల్లాచెదురై తిరిగి మళ్లీ గుమిగూడు తున్నారు. వెనకాల తాళ్లు పట్టుకున్న ఇద్దరూ, బడేసాయిబుని లాగి పట్టుకుంటున్నారు. అలా ఒక పది నిముషాల సేపు సాగిన తర్వాత ఆగింది డాన్స్.

చప్పట్లతో ఆ ప్రదేశం అంతా ప్రతిధ్వనించింది. పిల్లలు కొంధరు, బడే సాయిబుని ముట్టుకుందామని భయంభయంగానే ప్రయత్నిస్తున్నారు. బడే సాయిబు నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లి ఆఫీసులో అరుగు మీద విశ్రమించాడు. నెమ్మదిగా పిల్లలు అందరూ వెళ్లిపోయారు.

సోమేశ్వరరావు మాస్టారి లైను మళ్లీ కదలటం ప్రారంభించింది. బడే సాయిబు చాల అలసి పోయాడు. నీరసం ఆవహించింది. గొంతుక తడారిపోయింది. ఒళ్లంతా చెమటలు పట్టేసి తడిసిపోయింది.

ఆఫీసులో వాళ్లు ఎవరో నీళ్లు తెచ్చి ఇచ్చారు తాగటానికి. వద్దని సైగ చేశాడు బడే సాయిబు. రంజాన్ ఉపవాసంలో నీళ్లు కూడా తాగకూడదు మరి. ఆఫీసులో వాళ్లు అతని పక్కన కూర్చుని కాసేపు కబుర్లు చెప్పారు.

టైం అయిదు అయింది.

'పదండ్రా ఇంక. ఆర్డీవోగారి ఇంటికి వెళ్లాలి. అదే ఇవాళ్టికి ఆఖరి

మజిలీ' అంటూ లేచాడు బడే సాయిబు. ఆఫీసులో సహోద్యోగులు అందరికీ సలాం చెప్పి బయలుదేరాడు. బడే సాయిబు, అతని పార్టీతో కలిసి శంకరమఠం మీదుగా గోకుల్ బేకరీ, మునిసిపల్ ఎలిమెంటరీ స్కూలు దాటుకుంటూ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి దగ్గరికి వచ్చాడు.

గుడి బయట పూజారి చైనులు గారు నిలబడి బడే సాయిబు కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్లిద్దరిదీ చాలా అవినాభావసంబంధం. దాదాపు ముప్పయ్యేళ్ల నుంచి ఒకళ్లంటే ఒకళ్లు అవ్యాజమైనప్రేమతో మెలిగారు. చైనులుగారు వేదపాఠశాలకు వెళ్లక ముందు, అయిదో క్లాసు వరకు మామూలు స్కూల్లో చదివారు. అప్పుడు బడే సాయిబు ఆయనతో పాటు చదివాడు. ఆ అయిదేళ్ల పాటూ, కాలక్రమేణా చైనులుగారు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుళ్లో పూజారిగానూ, బడేసాయిబు అదే ఊళ్లో ఆర్డీవో గారి దగ్గిర డ్రైవరుగానూ సెటిలైపోయారు. వాళ్లిద్దరి పేదరికం వాళ్లిద్దరి అనుబంధానికి మరింత బలాన్ని ఇచ్చింది.

ప్రతి సంవత్సరం దసరా నాడు బడే సాయిబు పులి వేషం వేసుకుని, చిట్టచివరికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి పక్క సందులో ఉండే ఆర్డీవో గారి ఇంటికి వస్తాడు. ఆ సమయంలో గుడి ముందు బడే సాయిబుకి స్వాగతం పలికి, ప్రసాదం, కొబ్బరి నీళ్లు ఇవ్వటం పూజారి చైనులు గారికి ఆనవాయితీ.ఇవాళ కూడా అదే పని మీద గుడి ముందు నిలబడి ఉన్నారు చైనులు గారు. 'రావయ్యా బడేసాయిబూ. బాగా అలసిపోయినట్లుగా ఉన్నావే' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించారు.

బడే సాయిబు అక్కడ అరుగు మీద కూర్చుంటూ అన్నాడు, 'చైనులూ. ఇది రంజాన్ నెల కదా. ఉపవాసం చేస్తున్నాను. అందుకని అలుపు కొంచెం ఎక్కువగా ఉంది' అని.

'ఓ నేను మరిచిపోయాను సుమా!' స్నేహితుడిపైన తనకి ఉన్న గౌరవం ఇంకా అధికమైనట్లుగా చైనులు గారి కళ్లు చెపుతున్నాయి.

'అయితే ఒక పని చెయ్యి. ఆర్డీవోగారి ఇంటికి వెళ్లి అక్కడ పని పూర్తి అయిన తర్వాత, తిరిగి వెళ్లేటపుడు ఇక్కడికిరా. అప్పటికి నీ ఉపవాసం విరమించే సమయం కూడా అవుతుంది' అన్నారు చైనులు గారు.

సరేనన్నాడు బడే సాయిబు.

బడే సాయిబు, అతని పార్టీ పక్కన ఉన్న సందులోకి దారి తీశారు. ఆ వీధి పేరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వీధి. అందులో కుడి పక్కన చివరి ఇంట్లో ఆర్డీవోగారు ఉంటారు. అది ఒక డాబా ఇల్లు. కాంపౌండ్ వాల్‌కి ఉన్న చిన్న గేటు తీసుకుని లోపలికి వెళితే, వరండాకి గేటుకి మధ్య సన్నటి వాకిలి.

కొత్తగా వచ్చిన ఆర్డీవోగారికి తన విద్య చూపించుకోవాలని, ఆయన ఎదురుగా పులి డాన్స్ చెయ్యాలని తహతహగా ఉంది బడే సాయిబుకి. ఆ ఉత్సాహంలో అతని నీరసం అంతా ఎగిరిపోయింది.

గేటు దాటి లోపలికి వెళితే డాన్స్ చెయ్యటానికి సరిపడ స్థలం లేకపోవడంతో, గేటు బయటే రోడ్డు మీద నిలబడి ఉన్నాడు బడే సాయిబు. డప్పులు చిన్నగా మోగుతున్నాయి. చుట్టుపక్కల ఇళ్లల్లోంచి అందరూ బయటికి వచ్చారు. వాళ్లల్లో చాలా మంది బడే సాయిబు పులి వేషం అంతకు ముందు చూసినవారే. ఎదురింటిలో నుంచి నారాయణరావుగారు వచ్చి బడే సాయిబుని పలుకరించారు. ఆయనకి అరవై ఏళ్లు ఉంటాయి. చాలా సంవత్సరాలుగా బడే సాయిబు పులి వేషం చూస్తున్నారు.

ఆ వీధిలో పిల్లలు అందరూ బడే సాయిబు చుట్టూ మూగారు. గేటు లోపల్నుంచి బంట్రోతు ధర్మారావు వచ్చాడు నవ్వుతూ. బడే సాయిబుని పలుకరించాడు. ఆర్డీవోగారు వస్తున్నారని చెప్పాడు.

ఆర్డీవోగారి పిల్లలు చిన్నవాళ్లు. నలుగురు మగపిల్లలు ఇంట్లోంచి పరుగెత్తుకుంటూ వచ్చారు. అందులో చివరివాడు బడే సాయిబుని చూసి భయపడి, వచ్చినంత వేగంగా మళ్లీ ఇంట్లోకి పరుగుపెట్టాడు. మిగతా ముగ్గురూ ధర్మారావు పక్కన చేరి, బడే సాయిబు వంక వింతగా చూస్తున్నారు.

రెండు నిముషాల్లో ఆర్డీవోగారు, వారి సతీమణి బయటికి వచ్చారు, ఇంట్లో నుంచి. బడేసాయిబు నిలబడిన చోటి నుంచే 'సలాం సాబ్' అంటూ ఆర్డీవోగారిని నమస్కారం చేశాడు.

ఆయన నవ్వుతూ గేటు దగ్గరికి వచ్చారు. ఆయన భార్య కూడా వచ్చి ఆయన పక్కన నిలబడ్డారు. చివరి పిల్లాడు ఆవిడ వెనకాలే కొంగు పట్టుకుని నిలబడి ఉన్నాడు, భయంభయంగా నక్కి చూస్తూ.

ధర్మారావు వివరించాడు, 'బడే సాయిబు ప్రతి దసరాకీ పులి వేషం వేస్తాడు సార్. అంతకు ముందు వాళ్ల నాన్న వేసేవాడు. గత నలభై సంవత్సరాల నుంచీ ఈ కుటుంబం వేసే పులి వేషం ఈ ఊళ్లో దసరాకి మంచి హై లైటండి. అయ్!'

అప్పటికే బడే సాయిబు నెమ్మదిగా డాన్స్ చెయ్యటం మొదలు పెట్టాడు. చుట్టూ చేరిన పిల్లలు చప్పట్లు కొడుతున్నారు. డప్పులు క్రమంగా స్పీడు అందుకున్నాయి. బడే సాయిబు డాన్స్ కూడా స్పీడు అందుకుంది. ఈ రోజుకి ఇంక ఇదే చివరి డాన్స్. బడే సాయిబు తన శక్తిని అంతా కూడగట్టుకుని ఉత్సాహంగా చేస్తున్నాడు. ఈ రోజు ఈ పులి డాన్స్‌కి ఉన్న ప్రాముఖ్యం అతనికి అలుపు తెలియకుండా చేస్తోంది. తన తండ్రి నమ్మిన మతసామరస్యవిలువలకి, తనకి నూరిపోసిన మానవత్వవిలువలకి, బడే సాయిబు ఎప్పుడూ తండ్రిని మనసులోనే కృతజ్ఞతాభావంతో తలుచుకుంటూ ఉంటాడు, ఈ డాన్స్ చేసేట ప్పుడు. ఆ ప్రేరణే అతనికి అమితమైన శక్తిని ఇచ్చింది.

పావు గంటకి డాన్స్ పూర్తి అయింది. అందరితో పాటు ఆర్డీవోగారు కూడా చప్పట్లు కొట్టారు. బడే సాయిబు నమస్కారం చేస్తూ ఆర్డీవో దగ్గరికి వచ్చాడు. ఆయన కూడా ప్రతి నమస్కారం చేస్తూ, 'బడే సాయిబూ, చాలా బాగా చేశావు. రంజాన్ నెలలో ఉపవాసం చేస్తూ కూడా ఇలా పులి డాన్స్ చెయ్యటం చాలా పట్టుదల ఉంటేగాని చెయ్యలేరు. గ్రేట్!' అన్నారు. ఆర్డీవో గారు బడే సాయిబుకి యాభై రూపాయలు ఇవ్వబోయారు.

బడేసాయిబు డబ్బు తీసుకోకుండా నమస్కారం చేస్తూ, 'వద్దు సార్, ఈ డాన్స్ చేసేటప్పుడు ఎవరి నుంచీ డబ్బు తీసుకోను. ఇది మా అబ్బాజాన్ నాకు నేర్పిన పాఠం. అన్ని మతాలూ కలిసి మెలిసి ఉండాలనే ఈ పులి వేషం ఈ రోజున వేస్తాను' అన్నాడు.

ఆర్డీవోగారి కళ్లు చెమ్మగిల్లాయి. 'బడే సాయిబూ. నీ జన్మ ధన్యం! నువ్వు ఈ రోజు నా అంచనాలలో ఎంతో ఉన్నతస్థానానికి ఎదిగి పోయావు. అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!' అంటూ షేక్ హాండ్ ఇచ్చారు.

బడే సాయిబు అందరికీ నమస్కారం చేసి శలవు తీసుకున్నాడు. అతను, అతని పార్టీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడివైపు దారి తీశారు.

గుడి దగ్గర చిన్న అరుగు మీద కూర్చుని చైనులు గారు ఎదురు చూస్తున్నారు. బడే సాయిబు తిరిగి వచ్చేలోగా గబగబా వెళ్లి ఖర్జూరాలు తీసుకువచ్చారు. స్వామికి నైవేద్యం పెట్టిన అరటిపళ్లు, కొబ్బరి ముక్కలు, పులిహోర, కొబ్బరి నీళ్లు అందరికీ సరిపోయేట ట్లుగా సమృద్ధిగా తెచ్చి అరుగు మీద పెట్టారు.

ఆరు గంటలు కొడుతోంటే బడే సాయిబు తన పార్టీలో కలిసి గుడి దగ్గరికి చేరాడు. అప్పటికే ఉపవాసం విరమించే వేళ అయింది.

చైనులు గారు బడేసాయిబుని కౌగలించుకున్నారు. అరుగు మీద తన పక్కనే ఆప్యాయంగా కూర్చోబెట్టుకున్నారు. సంప్రదాయం ప్రకారం, ఖర్జూరం తన చేతుల మీదుగా తినిపించి నీళ్లు తాగించారు. ఉపవాసవిరమణ చేయించారు. తరువాత తన చేతులతో దైవప్రసాదం పులిహోర బడే సాయిబు నోటికి అందించి తినిపించారు.

చైనులు గారి కనుకొలకుల్లో నీరు నిలిచింది. అవి ఆనందబాష్పాలా... పులకించిన హృదయంలో నుంచి ఉప్పొంగి పొరలిన భావోద్వేగపు కెరటాలా?

వాళ్లిద్దరినీ చూసి ప్రకృతి చలించింది. ఒక సన్నటి గాలి, ఈ కబురు దేశం అంతా చెప్పటానికా అన్నట్లుగా నెమ్మదిగా వీచుకుంటూ వెళ్లిపోయింది.